# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలోని ఓడరేవులను ఆధునీకరించడంతో పాటు జలమార్గాలను అభివృద్ధి చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ లో పచ్చదనాన్ని పెంచి హరితాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **నీరు చెట్టు పథకం బిల్లులను విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **రైతుల ఆదాయాన్ని పెంచేలా వ్యాపార పంటలను ప్రోత్సహించాలని కేంద్ర గ్రామీణాభివద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.**
5. **తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు.**
6. **అల్పపీడనం ప్రభావంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

దేశంలోని ఓడరేవులను లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో ఆధునీకరించడంతో పాటు కీలక జలమార్గాలను అభివృద్ధి చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వధ్వన్ పోర్టుకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. అలాగే మత్స్యకారుల కోసం వివిధ మత్స్య ప్రాజెక్టులను ప్రారంభించి, ట్రాన్స్ పాండర్లు, కిసాన్ క్రెడిట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... గత దశాబ్దంలో భారత సముద్ర తీర ప్రాంతంలో అభివృద్ధి వేగం పుంజుకుందని, ఫలితంగా ప్రైవేటు పెట్టుబడులు కూడా పెరిగాయని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న దృశ్య మాధ్యమం విధానంలో బటన్ నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మత్స్యకారుల జీవితాల్లో ఈ ఫిషింగ్ హార్బర్ వెలుగులు నింపాలని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తూ బాసటగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 288

కోట్ల రూపాయల వ్యయం తో 76.89 ఎకరాల్లో ఫిషింగ్ హార్బర్ ను నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ హార్బర్ నిర్మాణం ద్వారా ఏడాదికి 40 వేల టన్నుల మత్స్య సంపద లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనాన్ని పెంచి హరితాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఉన్న ఎకో పార్కులో నిన్న నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఏటా కనీసం రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు పెరగాలంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు విరివిగా మొక్కలు నాటాలని, మొట్టమొదటిగా నాటే మొక్కకు వారి తల్లి పేరు పెట్టి వాటిని సంరక్షించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం 29 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. వనమహోత్సవానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

---------------------------

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామంలో నిన్న నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనం పెంచే వనమహోత్సవ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. కాలుష్య నివారణకు, వర్షాలు కురిసేందుకు మొక్కలు నాటాలని పేర్కొంటూ...

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో నీరు చెట్టు పథకం బిల్లులను తక్షణమే విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నీరు చెట్టు పథకంపై మంత్రులు నిన్న సమీక్ష నిర్వహించారు. సమావేశం అనంతరం జలవనరులశాఖ మంత్రి రామానాయుడు మాట్లాడుతూ, నీరు చెట్టు పథకం కింద మొత్తం 695 కోట్లు చెల్లించాల్సి ఉందని, తక్షణమే 259 కోట్లు చెల్లించేలా సన్నాహాలు చేస్తున్నామన్నారు. మిగిలిన నిధులు కూడా త్వరలో విడుదల చేసేలా సమీక్ష సమావేశంలో చర్చించినట్లు మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రైతుల ఆదాయ వనరులు పెంచే విధంగా వ్యాపార పంటలపై అవగాహన పెంచి రైతులను ప్రోత్సహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. నిన్న గుంటూరులో వ్యవసాయ, ఆరోగ్య శాఖల అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, స్థానిక పంటల ఆధారంగా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతుల ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యావరణ హిత, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్య పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ వెలుపల మరో జంతు ప్రదర్శనశాల అభివృద్ధికి

ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో అపరిష్కృత పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం నేతన్న చేయూత పథకానికి 90 కోట్ల రూపాయలను విడుదల చేసిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిన్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు అనంతరం అయన మాట్లాడుతూ.. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో చేనేత వస్త్రాలు వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. హుస్నాబాద్లో చేనేత, జౌళి పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి ఈరోజు. సంగీతం, సాహిత్యం నృత్యాల మేళవింపుతో హరికథా ప్రక్రియకి విశేష ప్రచారం కల్పించిన ఆయన.. 1864 ఆగస్టు 31వ తేదీన విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అజ్జాడ గ్రామంలో జన్మించారు. రచయిత, కవి, బహుభాషాకోవిదుడు అయిన నారాయణదాసు తెలుగులో 17, సంస్కృతంలో 3, అచ్చతెలుగులో ఒక హరికథను స్వయంగా రచించారు. హిందుస్థానీభైరవి రాగాలాపనకు గానూ రవీంద్రనాథ్ ఠాగూర్‌తో ప్రశంసించబడ్డ ఆదిభట్ల నారాయణదాసు 1945 జనవరి 2వ తేదీన తుదిశ్వాసవిడిచారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్ర ప్రదేశ్ లో రాగల 24గంటల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 45-నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు.. తెలంగాణాలో రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

పారాలింపిక్స్ రెండవ రోజు భారత క్రీడాకారులు పతకాలను సాధించారు. నిన్న జరిగిన క్రీడల్లో భారతీయ క్రీడాకారులు ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ లో ఆవని లేఖర స్వర్ణ పతాకాన్ని సాధించగా, ఎయిర్ పిస్టల్ లో షూటర్ గా ప్రతిభ కనబరచిన మనీశ్ నర్వాల్ రజత పతకం సాధించారు. మహిళల 100 మీటర్ల టీ35 విభాగం ఫైనల్‌లో స్ప్రింటర్ ప్రీతి పాల్ కాంస్య పతకాన్ని సాధించగా 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ లో మోనా అగర్వాల్ కాంస్యం అందుకున్నారు. పతకాలను సాధించినవారిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు. ఈ విజయం వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

=====================